కిటికీ

'ఏమండోయ్'

'...................'

'ఇదుగో మిమ్మల్నే.'

'ఆఁ - ఏమిటి?' పుస్తకంనుంచి ఈ లోకంలోకి వచ్చాను.

'ఒకసారి ఇలా వస్తారూ.'

ఏదో రహస్యం చెప్పేందుకు పిలిచే పద్ధతి ఇది. చదువుతున్న పుస్తకం చాలా ఇంటరెస్టింగ్‌గా వుంది వదల బుద్ధిపుట్టలేదు.

'నువ్వే ఇటు వద్దూ.'

'బాగుంది వరస.' రుసరుసలాడుతూ వచ్చింది.

'ఇదుగో - ఇటు వినండి.'

'ఆఁ - వింటున్నాను చెప్పు.'

చేతులో పుస్తకం లాక్కొని అన్నది 'ఇదుగో మీరింక ఆ రంగనాథ రావుతో కలిసి తిరిగారంటే నామీద ఒట్టు.'

'అదేమిటే - ఆయనేం చేశాడు పాపం - చాలా ఉత్తముడు.'

"ఆ ఉత్తములే - ఈ ధర్మరాజుకు లోకమంతా మంచివాళ్లుగానే కనిపిస్తారు - ఆయనతో మీరు స్నేహంచేయడానికి వీలులేదు. ఆయన మనింటికి రావడానికసలే వీలులేదు ముందే చెబుతున్నాను."

'ఎందుకు? రంగనాథరావు నన్నేమన్నా అన్నాడా?'

"లేదు - అంతా రంగనాథరావునే అంటున్నారు."

"ఏమని."

"ఆయన గుణం మంచిదికాదని."

అదిరిపడ్డాను.

"ఏమంత ఆశ్చర్యపడతారు? రంగనాథరావు వట్టి స్త్రీలోలుడట! పెళ్ళాన్ని ఎప్పుడూ ఏడిపిస్తూవుంటాడట - రాత్రిళ్లు ఎక్కడెక్కడో తిరిగి ఏ తెల్లవారు జామున ఇంటికి వస్తాడట బాగా తాగి."

"ఛత్ - నోరుముయ్ - అబద్ధమాడి రా అతికేటట్లుండాలి - రంగనాథ రావేమిటి తాగడమేమిటి, తిరుగుబోతు కావడమేమిటి- ఎవడన్నా వింటే నవ్విపోతాడు."

"అదే నేనూ అంటున్నది - మీరాయనతో ఇలా రాసుకు పూసుకు తిరుగుతుంటే లోకం నవ్విపోతుందనే నేనూ చెప్పడం" విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

నేను ఆలోచనలోపడ్డాను - రంగనాథరావుతో గత సంవత్సరంగా నాకు మంచి పరిచయమే వున్నది. హైదరాబాదునుంచి చీరాలకు ట్రాన్స్ఫర్ అయినప్పటినుంచీ రంగనాథరావు చేదోడు వాదోడుగా వుంటూవున్నాడు, ఇల్లు వెతికి పెట్టడంలోనూ నలుగురినీ పరిచయం చేయడంలోనూ ఎంతో సహాయపడ్డాడు. అయితే నాకు సహాయపడ్డాడు కాబట్టి ఆయనలో దుర్గుణాలేవీ లేవని అనడం కాదు కాని, చూచినంత లెక్కలో ఆయనలో దురలవాట్లేవీ కనిపించలేదు - కాఫీ కూడా తాగడు - కనీసం పాన్కూడా నమలడు.

లైటు ఆర్పేసి పడుకున్నాను కాని నిద్రపట్టలేదు - ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు?

తెల్లనివన్నీ పాలని నమ్మేవాణ్ణి నేను- నిజంగా రంగనాథరావులో దుర్గుణాలున్నాయో ఏమో - ఎవరు చెప్పగలరు??

నిప్పులేనిదే పొగ పుట్టదుకదా!

నేనేం రంగనాథరావు నిజజీవితంలోకి ప్రవేశించి చూచానా ఏమిటి ఆయన గుణ స్వభావాలు.

పోనిద్దూ....లోకం ఎలాపోతే నాకేం

ఇలా అనుకున్నా నిద్ర పట్టటంలేదు.

మనస్సంతా వికలమైంది.

రంగనాథరావుగూర్చి నేను ఊహించుకున్న భావచిత్రం మసక మసకబడజొచ్చింది.

ఎప్పుడు కునుకుపట్టిందో ఏమో....

x x x x

మర్నాడు ఆఫీసులో రంగనాథరావు కనబడ్డాడు.

రోజూ చూచే రంగనాథరావే - అయినా ఆయనలో నాకేదో కొత్తదనం కనిపించింది.

ఆ వైలక్షణ్యం నా ఆలోచనా సరళిలోని పరివర్తనవల్ల వచ్చిందని నాకు తెలుసు.

రంగనాథరావు మటుకు మామూలుగానే మల్లెపువ్వులా నవ్వాడు.

అయితే నేనుమాత్రం దానిని ప్రతిరోజులాగా స్వీకరించలేకపోయాను.

కూర్చొని పని చేస్తున్నానే కాని మనస్సు మొత్తం రంగనాథరావు అవినీతి మీదే వుంది.

ఏదోలా సాయంత్రమైంది.

"క్యాభాయ్ - చలేంగే" అంటూ హుషారుగా రంగనాథరావు వచ్చాడు.

నాకెందుకో రంగనాథరావుకు కొంచెం ఉచితంగా ధర్మబోధ చేయాలనిపించింది.

ఇద్దరం సైకిళ్ల పట్టుకొని నడుస్తున్నాం.

భర్తృహరి సుభాషితాలలోనుంచి శ్లోకాలు చదివాను.

శంకరాచార్యులవారి భజగోవిందం చదివాను.

"వో జీవా! ఏముంది స్త్రీలో - మాంసమూ చర్మమూ మొదలైనవాటి వికారమేకదా! మళ్ళీ మళ్ళీ స్మరించి గ్రహించు తత్వం" అని అర్థం వచ్చే పాదాలు కొన్ని వినిపించాను.

రంగనాథరావు పక్కున నవ్వి "ఈ సన్యాసులు మహా చెడ్డవాళ్ళయ్యా" అన్నాడు.

"ఏం?" అన్నాను.

"మనల్ని బొత్తిగా సంసారాలు కూడా చేసుకోనిచ్చేట్లులేదు. మరీ ఇంత వికారంగా జీవితాన్ని వర్ణిస్తే బ్రతుకుమీద అసహ్యంపుట్టదూ-" అన్నాడు.

"రంగనాథరావ్! బ్రతుకుమీద అసహ్యం పుట్టడంకాదు - అవినీతిమీద అసహ్యం పుట్టించడం దీని పరమార్థం" అన్నాను.

"ఇంతకీ నీవు రాత్రి ఏదన్నా హరికథకో, పురాణా కాలక్షేపానికో వెళ్ళి వచ్చావా?" అన్నాడు.

"ఏమి అట్లా అడుగుతున్నావు?"

"మరేంలేదు - ఉన్నట్లుండి ఇలా వైరాగ్యమూ - ధర్మోపదేశాలూ ప్రారంభమైనాయ్ అని-" ఆత్మీయతతో నా నీపు చరిచాడు.

వెన్నలా కరిగిపోయాను.

అయినా భార్య రాత్రి అన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి. ఎంత అనురాగం నామీద చూపితే మాత్రమేం, ఇతనొక తాగుబోతు తిరుగుబోతు - అదిమాత్రం మరచిపోకూడదు సుమా!

"రంగనాథ్ జీ!"

"ఏం భాయ్."

"పద మీ ఇంటికి వస్తాను."

ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి? ఫామిలీ ఎక్కడికన్నా వెళ్ళిందేమిటి?"

ఇలా అడగడంలో ఆశ్చర్యంలేదు - అయిదున్నర కాగానే ఉరుకులు పరుగులతో ఇంటిమీద పడతాడు ప్రతి ఎంప్లాయీ- లంచ్ ఇంటర్వెల్ తర్వాతి నుంచే మాకళ్ళు మొత్తం గడి యారపు ముళ్ళకు అతుక్కొనిపోయి వుంటాయి- అలాంటిది తాపీగా వాళ్ళింటికి వస్తానంటే ఆశ్చర్యపడడూ...

"భ్రష్టస్య కావాగతిః" అని అటు నీతి బోధించినట్లూ ఇటు ఏదో కూని రాగం నాతో నేనే ఆలాపించినట్లూ అన్నాను. రంగనాథరావు విని "ఎవడు అల్లాడో కాని భలే కథ అల్లాడోయ్" అన్నాడు

"ఏమి?" అన్నాడు.

"లేకుంటే భోజరాజు తిరుగుబోతు కావడమేమిటి - దానికి కాళిదాసు మారువేషంలో గుణపాఠం నేర్పడమేమిటి? మనవాళ్ళ మనస్తత్వాలు తమాషాగాలేవూ."

ఉలిక్కిపడి భుజాలు తడుముకున్నాను. కాని తననే ఉద్దేశించి అన్నానని తాను నన్నే ఉద్దేశించి అన్నాడా?

(ఇంతవరకూ ఆకథ ఏమిటంటే - భోజరాజు తిరుగుబోతుగా మారాడని తెలిసి ఆయన భార్య కాళిదాసు సహాయం కోరిందట! సరేనని కాళిదాసు మారు వేషం వేసుకోని భోజరాజు వేశ్య ఇంటికి వెళ్ళే దారిలో ఒక కల్లు అంగడివద్ద నిలుచున్నాడట ధగధగ మెరిసే బొట్టూ, జంధ్యమూ చూచి భోజరాజు "అరే బ్రాహ్మడివి. నువ్వు కల్లు తాగుతావా?" అన్నాడట!

"లేదండీ.ఎప్పుడైనా మాంసం తిన్నప్పుడే తాగుతాను" అన్నాడట కాళిదాసు.

"అయితే నీవు మాంసంకూడా తింటావన్నమాట."

"లేదండీ! జూదంలో పైసలు వచ్చినప్పుడు మాత్రమే తింటాను."

"అయితే నువ్వు జూదంకూడా ఆడుతావా?"

"లేదండీ.ఎప్పుడై నా అరుదుగా దొంగతనంలో కలిసివస్తేనే ఆడుతాను."

"అయితే నీవు దొంగతనంకూడా చేస్తావన్న మాట."

"చెయ్యను - నా వేశ్యకు డబ్బు అవసరమైనప్పుడు మాత్రమే చేస్తాను."

'అయితే నీవు వ్యభిచారివికూడానన్నమాట.'

'చెడిపోయేవాడికి ఒకదాని తర్వాత ఒకటి కదా!' అని వెళ్ళిపోయాడట కాళిదాసు.

ఇది విని భోజరాజు సిగ్గు తెచ్చుకొని దుర్బుద్ధి మానుకున్నాడని కథ.]

రంగనాథరావు ఇల్లువచ్చింది.

'ఏమేవ్-కాఫీపట్రా జల్దీ.'

'అవునండి-కాఫీపొడి అయిపోయిందని పొద్దున చెప్పాను-తెచ్చారా? లేదా' లోపలినుండి సీతారత్నం వచ్చింది.

ఆమె నన్ను చూచి గుమ్మంలోనే చటుక్కున ఆగిపోయి నాలుక కరుచుకుంది—ఏదో తప్పుచేసిన దానికి మల్లే-

'అరెరె-కాఫీపొడి తేవడం మాటలసందర్భంలో మరచిపోయానే-ఇదుగో బ్రదర్ .. ఇప్పుడే అయిదు నిమిషాల్లో వస్తాను ఏమీ అనుకోకు' సైకిల్ మీద తూనీగలా దూసుకుపోయాడు.

'టిఫిన్ తెచ్చిస్తాను అన్నయ్యగారు.'

'వద్దమ్మా-ఇప్పుడు తీసుకోను.'

'అదేం-మా వదినలాగా నేను చేయలేననా?' సీతారత్నం నవ్వింది. కాని ఆ నవ్వులో ఏదో మాన్లరేఖ కన్పడింది-వెనుకటిలా కార్తీకమాసపు వెన్నెలలా లేదు. అంతేకాదు సీతారత్నం చాలా నిరలంకారగా కన్పడింది-చెవులకూ ముక్కులకూ ఏమీ లేవు. మెడలో గొలుసులేవో ఉంటాలి.ఎందుకంటే క్రితం సారి నేను మా ఆవిడతో వాళ్ళ ఇంటికి వచ్చినప్పుడు ఈ గొలుసులాంటిదే, తనకూ కావాలని మా ఆవిడ నాకు చెప్పడం జ్ఞాపకం వుంది.

ఇంక అనుమానం దేనికి, అవన్నీ కరిగించి తాగుడుకు ఖర్చుపెట్టి వుంటాడు.

-లేక ఒకవేళ తలంటి పోసుకోవడం కోసం కూడా తీసి వుండవచ్చుగా.

'ఏమ్మా అంతా కులాసాగా వున్నారా.'

'ఏం కులాసాలేండి అన్నయ్యగారు - ఎక్కడున్నావే గౌంగళీ అంటే వేసినచోటనే అన్నట్టుండి మా సంసారం.'

షాక్ తిన్నాను.-లోగడ ఎన్నడూ సీతారత్నం తన సంసారాన్ని ఇంత పలుచన చేసుకోని మాట్లాడలేదు.-అందులోనూ ఇతరులముందే ఇలా అంటున్న దంటే నిజంగా మనస్సులో ఎంత బాధ లేనిదే అంటుంది??.

ఇంక అనుమానం దేనికి?

నా భార్య చెప్పిన మాటలకూ నేను చూస్తున్న దానికి పొత్తు కుదురు తున్నది-

అంటే వచ్చిన పని అయిందన్నమాట-

ఇంక వేరే ప్రశ్నించడం దేనికి??

అయినా ఏమని ప్రశ్నించాలి కనుక!-

కాని సీతారత్నమే నోరు విప్పింది 'అన్నయ్యగారూ-మీరు నా కో చిన్న సహాయం చేస్తారా'

'ఏమిటమ్మా అది'

'మీరు మరోలా అనుకోకండి-మీకంటే ఈ వూళ్ళో నాకు వేరే ఆత్మీయులు లేరు కాబట్టి ఈ మాటలు చెపుతున్నాను-దయతో మీ స్నేహితుడికి డబ్బు విలువను గూర్చి కొంచెం నచ్చ చెపుదురూ.'

'అదేమమ్మా-అయనకేం దుర్వ్యసనాలు లేవే-ఎందుకు డబ్బు వృధా చేస్తాడబ్బా.'

సీతారత్నం నిట్టూర్చింది-

'అది నా ఖర్మం' డబ్బు పోవడానికి ఎన్నో మార్గాలున్నాయి....తాగితేనే వ్యసనమా? ఎవతెకైనా ఇస్తే వ్యసనం కాదా?'

పిడుగువడ్డట్లయింది-

'ఎవతెకు?' అని నేను ప్రశ్నించలేక పోయాను మౌనం కాలాన్ని మరింత బరువుగా మార్చింది

రిలీఫ్‌కోసం దిక్కులు చూస్తున్నాను. టిఫెన్ తెచ్చేందుకనుకుంటాను సీతారత్నం లోపలికి వెళ్ళింది-గుమ్మంలో వచార్లు చేస్తున్నాను.

అవతల మేడమీద ఎవరో వీణ వాయిస్తున్నారు. అది నా మనస్సును మరింత కలత పెట్టింది-సంగీతంలో ఎక్కడా ఆనందం లేదు-మాధుర్యం లేదు. ఇది నా మనోలక్షణమా? లేక వాళ్లెవళ్ళో పాడుతున్న ఆపాటే అలా వుందా??

ఏమో మరి-

రంగనాథరావువచ్చారు-

'ఏం బ్రదర్-రాధగారి సంగీతం వింటున్నావేమిటి-రా, రా, కాఫీతాగేద్దాము ఇదుగో ఇంకా టిఫిన్ ఇవ్వలేదా, ఏమిటీ మీ అన్నయ్యకు.'

రంగనాథరావు అప్యాయత మొత్తం అసహ్యంగానే కన్పించ సాగింది నాకు!

నాకు టిఫిన్లు ఇచ్చి కల్లబొల్లి కబుర్లు చెప్పినంత మాత్రాన సంతోషిస్తా ననుకున్నాడేమో-కారక్టర్ లేకపోతే ఇంకెందుకీ దో స్తీ!

సీతారత్నం టిఫెనూ, కాఫీ ఇచ్చింది.

అయిష్టంగానే తీసుకున్నాను.

కిటికీనుండి విషాద సంగీతం!

'గురూ-మ్యూజిక్ ఎలాగుంది, మజాగా లేదూ-'

కాఫీ చప్పరిస్తూ అన్నాడు రంగనాథరావు.

'ఎవరేమిటి పాడేది' ఏనో అనాలిగా మరి-అన్నాను.

'సీతాపతిరావు లేడూ అదేనయ్యా-బ్యాంక్ కాషియర్ సీతాపతిరావు-ఆయన భార్య-వోహ్ బ్రహ్మాండంగా వాయిస్తుందిలే-అమర సంగీత... ఏమేన్-కాఫీ మరీ కషాయంలా కాచావేమిటి కొంచెం పంచదార పట్రా-సారీ బ్రదర్ ఏమనుకోకు-' నావంతుకూడా తానే మాట్లాడుతున్నాడు-

'సీతారత్నం మరో స్పూను పంచదార తెచ్చి కలిపింది-అయినా సరే కాఫీ నా మనస్సుకు విషంలా వుంది-

'వస్తాను రంగనాథం ఇప్పటికే చాలా ఆలస్యమైంది' అంటూ లేచాను.

రంగనాథరావు హుషారుగా వీడ్కోలు చెప్పాడు-సైకిలెక్కి ఇల్లుచేరాను.

'ఏమండీ-ఇంత ఆలస్యమైంది-' గుమ్మంలోనే ప్రశ్న!

'..........'

'ఎక్కడికి వెళ్ళారేమిటి?'

మాట్లాడకుండా సైకిలును లోపల పెట్టి లాక్ చేస్తున్నాను.

'ఆ రంగనాథరావుగారింటికిపోయారా?'

'ఏం-పోతే ఏం?'

'నేననుకుంటూనే వున్నాను-అవ్వ' అని నోటిమీద చెయ్యివేసుకోని 'అతనితో స్నేహం మానమని నేను నెత్తిమీద నోరుపెట్టుకోని చెపుతున్నాను- వింటేనా? చివరకు మిమ్మల్నో తాగుబోతుగానో మందలముఠా కోరుగానో చేసి కాని వదిలేటట్లు లేడా ప్రబుద్ధుడు-"

"చాల్లే నోరుముయ్."

నా ఆవేశానికి కళ్ళనీళ్ళు పెట్టుకొని నిజంగానే నోరుమూసుకొని వెళ్ళి పోయింది.

ఇకమీద రంగనాథరావుగారింటికి పోకూడదని అనిపించింది ఆఫీసులో కనపడ్డా మాట్లాడకూడదు ...

రాత్రి నిద్రపోయేవరకు మా ఆవిడ సణుగుతూనే వుంది.

ఈవిడనిక మహిళామండలికి పోనివ్వకూడదని అనుకున్నాను.

ఏవో కుట్లూ, అల్లికలూ నేర్చుకుంటుంది లెమ్మని కాలక్షేపానికి పొమ్మని చెపితే చివరకు ఇలాంటి దెబ్బలాటలు తెస్తున్నదేమిటి??....

ఎలాగో ఆరాత్రి గడిచింది.

అలాగే వో వారంరోజులుకూడా గడిచాయి. ఈ లోపల మళ్ళా కొన్ని వార్తలు, కొంత సమాచారం.

రంగనాథరావు ఎవరో అమ్మాయితో థియేటర్‌లో కన్పించాడట!

తాగి తూలుతున్నట్లు నడుస్తున్నాడట!

'ఇదుగో లక్ష్మి! నాకికమీద రంగనాథరావుగూర్చి మీ మహిళామండలి సమాచారం ఏదన్నా ఇంట్లో అందించావంటే నామీద ఒట్టు" గట్టిగా మందలించాను.

లక్ష్మిని మందలించానే కాని నా మనస్సు మాత్రం వికలమైపోయింది- రంగనాథరావుతో వెనుకటి ఆత్మీయిత చూపడం లేదు.

అకారణంగా నేనెందుకిలా ప్రవర్తిస్తున్నానో తెలియక రంగనాథరావు మథనపడుతున్నట్లు నేను గ్రహించాను.

అయినా నేనేం చేయగలను?

సాధ్యమైనంతవరకు తప్పుకోని తిరగసాగాను.

ఆనాడు ఆదివారం-ఎక్కడికీ పోకుండా ఇంట్లోనే వున్నాను.

రంగనాథరావు వచ్చాడు-తాగినవాడికి మల్లే కళ్లు ఎర్రగావున్నాయి.

సభ్యతకోసం 'రమ్మని" ఆహ్వానించాను.

'బ్రదర్-అర్జంటుగా డబ్బు కావాలి."

"ఎంత?" అనలేయి "ఎందుకు?" అని మాత్రం అన్నాను.

"కారణం తర్వాత చెపుతాను-వో వంద వుంటే చూడు."

"అదేమిటి నీ కళ్ళలా ఎర్రగా వున్నాయి తాగినవాడి కళ్ళలాగా" కావాలనే అన్నాను.

పేలవంగా నవ్వాడు రంగనాథరావు

"ఔను-తెల్లవార్లూ నిద్ర లేదు."

"ఎందుకని?"

"సుజాతకు ఒంట్లో ఏమీ బాగుండలేదు"

"............"

"సుజాత ఎవరు?"

'నా చెల్లెను' నివ్వెరపోయాను-రంగనాథరావు కొక చెల్లెలు వుందని నాకిదే మొదటిసారి తెలియడం-ఆమాటే పైకి అన్నాను.

ఈ లోపల లక్ష్మి లోపలనుండి వచ్చి మమ్మల్ని చూచింది.

రంగనాథరావు గౌరవ సూచకంగా నమస్కరించాడు.

లక్ష్మి మర్యాదకోసం ప్రతి నమస్కారంచేసి లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె నడక, చూపు,పట్టి నేనేదో కూడనిపనిచేస్తున్నానని వాకౌట్ చేసినట్లు అనిపించింది.

'ముందు డబ్బు తీసుకురా-తర్వాత చెపుతాను"

ఆ మాటలో వున్న మంత్రశక్తి ఏమిటో నాకు తెలియదు. కాని యాంత్రికంగా బీరువా వద్దకు వెళ్ళి పది పదులు లెక్కబెట్టి జేబులో పెట్టుకొని చొక్కా-తగిలించుకొని బయలుదేరాను.

నేను చేస్తున్న పనిని మాఆవిడ నిశ్చేష్టురాలై గుడ్లప్పగించి చూస్తున్నది.

రంగనాథరావును వెంబడించాను.

ఇరువురం నిర్మానుష్యంగా వున్న దారినుండి నడుస్తూ వెళ్తున్నాము.

రంగనాథరావు తన స్వంత కథ మొదలు పెట్టాడు..నేను వింటున్నాను-రంగనాథరావు ఆ కథను ఎలా చెప్పాడో నేను మీకు చెప్పలేను-ఎందువల్లనంటే

ఇదొక విచిత్రమైన కథ. రంగనాథరావు తండ్రికి సంబంధించిన కథ-రంగనాథ రావు తండ్రి ఎప్పుడో చేసిన తప్పుఫలితంగా సుజాత ఎవరికో జన్మించింది- అయితే ఆ విషయం ఎవరికీ తెలియదు-తండ్రి చనిపోతూ రంగనాథరావుకు ఆ విషయం చెప్పి మరీ వెళ్ళాడు. అప్పటినుంచి రంగనాథరావు సుజాతగూర్చి శ్రద్ధ వహించడం మొదలు పెట్టాడు-సుజాత తల్లికూడా చనిపోయింది-అనుకో కుండా సుజాతకు ఇటీవల చీరాల ట్రాన్స్‌ఫర్ అయింది. అప్పటినుంచి సుజాత యోగక్షేమాలు తానే స్వయంగా చూస్తున్నాడు-సుజాతకు టి. బి. దానికై రంగ నాథరావు డబ్బంతా హారతి కర్పూరంలా హరించుకొని పోతున్నది-ఈ కథను ఎంతో సభ్యతగా సంస్కారవంతంగా సూటిగా చెప్పాడు రంగనాథరావు నాకు.

"వస్తావా మా చెల్లెలును చూద్దాము."

"ఇప్పుడు కాదు మరోసారి వస్తాలే..."

"సరే-నేను మళ్ళీ కలుస్తాను నిన్ను" రంగనాథరావు వెళ్ళిపోయాడు.

ఇప్పుడర్థమైనాయి సీతారత్నం మాటలు "ఎవతెకో డబ్బు ఇవ్వడ"మంటే అంటే ఆమెకూ తెలుసునన్నమాట సుజాత రంగనాథరావు చెల్లెలని-

మరి ఈఅపార్థాలను కల్పించిందెవరు??

లక్ష్మి మీద నాకు బాగాకోపం వచ్చింది-

దురుసుగా ఇంట్లోకి ప్రవేశించాను. లక్ష్మి ఏడుస్తూ. పడుకోని వున్నది. వందరూపాయలు తగలేశానని ఏడుస్తుదని నాకు తెలుసు.

మెల్లగా అనునయిస్తూ నేను విన్న కథనంతా లక్ష్మికి ఏకరువు పెట్టాను. లక్ష్మి అలా తలవంచుకోని వింటూ వున్నది.

'చెప్పు లక్ష్మీ-రంగనాథరావు ఎంతటి ఉదాత్తుడో-కేవలం నైతికమైన ఏదో బాధ్యతకోసం తను మనధనాలను అర్పిస్తున్న అతని మంచితనం ఇప్పటి కైనా నీకు అర్థమైందా?'

లక్ష్మి ఏమీ జవాబు చెప్పలేదు-అయినా ఇటువంటి పరిస్థితిలో ఎవరైనా అనుమానపడటంలోకూడా తప్పులేదుకదా!! కాని వో రెండురోజులు అకారణంగా పలకడం మాత్రం మానివేసింది.

నామీద కోపం కావచ్చు లేక తాను చేసిన తప్పుకు ముఖం చెల్లకకావచ్చు ఆ రెండురోజులతర్వాత మళ్ళీ మెల్లగా మాటలు మొదలుపెట్టింది మామూలుగా నే!

నేనూ లక్ష్మి తప్పుచేసినట్లు భావించలేదు-

ఇలా వుండగా ఒకనాడు ఆఫీసునుంచి ఇంటికి రాగానే కాఫీ అందిస్తూ చెప్పింది 'ఇది విన్నారా-'

'ఏమిటి?'

'వాళ్ళ సదాశివరావులేడూ అదేనండీ వెంకటరంగంగారి కొడుకు.'

'ఆc-ఆc.'

'అతడు ఎం. డి తప్పాడట-బోడిగొప్ప-వెంకటరంగం ఇంకా కొడుకును కొలాలంపూర్ పరీక్షకు పంపి స్టేట్స్‌కు పంపాలని చూస్తున్నాడు-"

'ఎవరు చెప్పారు?'

'రాధ చెప్పింది. అదే కాషియర్ సీతాపతిరావుగారి భార్య.'

'ఏదీ మన రంగనాథరావుగారింటి పైన మేడలో అద్దెకుంటున్నారు-'

'ఆc-వాళ్ళే-ఆమె మా మండలి సభ్యురాలు.'

నేనేదో తీవ్రంగా ఆలోచిస్తున్నాను.

'పాపం రాధ చాలా మంచిదండీ-కాని ఆమె దురదృష్టం-ముసలిమొగుడు దొరికాడు.'

'అంటే ...'

సీతాపతిరావుకు చాలా డబ్బు వుందండి-రాధ, రెండో సంబంధం-కేవలం డబ్బు చూచి రాధ తండ్రి కూతురిగొంతు కోశాడు-సీతాపతిరావు బి. కాం ఫెయిలు అయినాడు-అయినా అనుభవంమీద కాషియర్ అయినాడు.'

'లక్ష్మి-లక్ష్మి'-ఆవేశంగా లక్ష్మి రెండు బుజాలూ పట్టుకొని వూపాను.

'ఏమిటండీ' తెల్లబోయి అడిగింది.

'నీకు రంగనాథరావు కథ చెప్పిందెవరు?"

'రాధే చెప్పింది.'

'మొన్న ఉద-చూస్టోర్స్‌వాడు దుకాణానికి వచ్చిన ఎవతెతోనో సరసాలాడి తన్నులు తిన్నాడని వార్తతెచ్చావే అదెవరు చెప్పారు?"

'రాధే ....ఎందుకండీ....'

'హోహ్హో.........." పెద్దగా కేక పెట్టాను.

'ఏమిటండీ-ఏమయింది-"

'ఏమీలేదు నీ వింట్లోకి పో.'

లక్ష్మి నావైపు అయోమయంగా చూస్తూ వెళ్ళిపోయింది.

రంగనాథరావును గూర్చి కొద్ది రోజులైనా తప్పునా భావించినందుకు ఎందుకో అతనికి క్షమాపణ చెప్పుకోవాలని మనస్సు పరితాప పడింది-కాఫీగ్లాసు కింద పడేసి అలాగే చకచక నడుచుకుంటూ రంగనాథరావు ఇల్లుచేరాను-రంగనాథరావుగారి గుమ్మంలో నిలబడేసరికి, ఆ ఇంటి పక్కనే సీతాపతిరావుగారి మేడమీద నుండి మళ్ళీ సన్నని సంగీతం వినపడుతోంది.

తల పైకెత్తి చూనాను.

మేడమీద కిటికీ పక్కనే రాధ కూర్చొని వున్నది-

సన్నగా సంగీతం అలాపిస్తున్నది-

ఆమె మనస్సు అనే కిటికీనుండి శబ్దాలు స్వరాలు అలా అలా అలల్లా గాలిలోకి వ్యాపిస్తున్నాయి.